






ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పోర్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 293 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 2 ✦ https:www.prajarepublic.com ✦ వెల - 1/-
ఆదివారం 25 మే 2025

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశమంతా ఏకమైంది..
# 122వ మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ

122వ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు.


**మే 25, (రిపబ్లిక్ న్యూస్):** ఆపరేషన్ సిందూర్ సమయంలో మన దళాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేశాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆదివారం మన్కీ బాత్ 122వ కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి మోదీ మన్కి బాత్లో ప్రసంగించారు. 'ఉగ్రవాదనికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో ఆపరేషన్ సిందూర్ కొత్త ఉత్సాహాన్ని నింపింది. మన దళాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేశాయి. దేశ ప్రజలను ఇది ఎంతగానో ప్రభావితం చేసింది.



అనేక కుటుంబాలు దీనిని తమ జీవితాల్లో భాగం చేసుకున్నారు. ఆపరేషన్ సమయంలో జన్మించిన చిన్నారులకు పలువురు సిందూర్ అని నామకరణం చేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశమంతా ఏకమైంది. నేడు ప్రతి భారతీయుడు ఉగ్రవాదాన్ని అంతం చేయాలనే సంకల్పంతో ఉన్నాడు. ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్య మాత్రమే కాదు.. మన ధైర్యం, దేశభక్తితో నిండిన నవభారతానికి నిదర్శనం. అనేక నగరాలు, గ్రామాలు, పట్టణాలో తిరంగ యాత్రలు నిర్వహించారు. పౌర రక్షణ వాలంటీర్లుగా మారేందుకు అనేక నగరాల నుంచి యువత ముందుకు వచ్చారు' అని మోదీ పేర్కొన్నారు. మరోవైపు మావోయిస్టుల హింసాత్మక చర్యలు క్రమంగా తగ్గుతున్నాయని తెలిపారు. దంతెవాడ ఆపరేషన్లో జవాన్లు చూపిన సాహసాన్ని ఆయన కొనియాడారు. నక్సలిజానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతోందన్నారు. నక్సలిజం నిర్మూలనలో గర్వించే విజయం సాధించామన్నారు. తెలంగాణలోని సంగారెడ్డి మహిళల గురించి ప్రధాని మోదీ మన్కీ బాత్లో ప్రస్తావించారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని ఆయన ప్రశంసించారు.

# విశాఖలో మోదీకి స్వాగతం పలికేందుకు ఎదురు చూస్తున్నాం:సీఎం చంద్రబాబు

మన్ కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ యోగాంధ్ర - 2025 గురించి ప్రస్తావించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.



**అమరావతి, మే 25, (రిపబ్లిక్ న్యూస్):** మన్ కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ యోగాంధ్ర-2025 గురించి ప్రస్తావించినందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ లక్ష్యం కోసం ఐక్యంగా ఉన్నారని గుర్తు చేశారు. జూన్ 21 వరకు 100 పర్యాటక ప్రదేశాలతో సహా రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజులపాటు యోగా సెషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగాను జీవితంలో అంతర్భాగం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు జూన్ 21న విశాఖలో మోదీకి స్వాగతం పలికేందుకు తాము ఎదురు చూస్తున్నామని చంద్రబాబు 'ఎక్స్' లో పోస్టు చేశారు.

# ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలతో ప్రధాని భేటీ

ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలతో ప్రధాని మోదీ భేటీ అయ్యారు.

దిల్లీ, మే 25, (రిపబ్లిక్ న్యూస్): ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలతో ప్రధాని నరేంద్ర మోదీ దిల్లీలో సమావేశమయ్యారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్నాథ్ సింగ్, భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా సహా పలువురు కేంద్రమంత్రులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. కుల గణన, మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతుండడం, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలన అంశాలు ఈ సమావేశంలో ప్రధాన ఎజెండాగా ఉన్నాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.




ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి ఈ సమావేశాన్ని నిర్వహిస్తుండడంతో దానికి సంబంధించిన వివరాలను సీఎంలు, డిప్యూటీ సీఎంలకు కేంద్ర మంత్రులు వివరించారు. తమ తమ రాష్ట్రాల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు వివరించారు. పహల్గాం ఉగ్రదాడి మృతులకు నివాళులు అర్పించారు. ఇందులో భాగంగా ఈ సమావేశంలో రెండు తీర్మానాలు ఆమోదించారు. ఆపరేషన్ సిందూర్ ప్రధాని మోదీ నాయకత్వాన్ని, సాయుధ దళాల పరాక్రమాన్ని అభినందిస్తూ ఒక తీర్మానం తీసుకురాగా.. దేశవ్యాప్తంగా కుల జనగణన చేపట్టడంపై మరో తీర్మానం చేశారు. సమావేశంలో భాగంగా.. ఆపరేషన్ సిందూర్ పై కాంగ్రెస్ సహా విపక్షాలు చేసిన విమర్శలను తిప్పికొట్టే అంశంపై చర్చలు జరగనున్నట్లు సమాచారం. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్నాథ్ శిందే మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రధాని సాయుధ దళాలకు అధికారాను ఇచ్చి.. ముందుకు నడిపించారని కొనియాడారు. ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదులకు, వారిని పోషిస్తున్న వారికి తగిన బుద్ధి చెప్పిందని అన్నారు.

# కవిత లేఖ..కేసీఆర్‌తో కేటీఆర్ భేటీ

భారాస అధినేత కేసీఆర్‌తో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భేటీ అయ్యారు.

**సిద్దిపేట, మే 25, (రిపబ్లిక్ న్యూస్):** భారాస అధినేత కేసీఆర్‌తో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భేటీ అయ్యారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి ప్రత్యేకంగా కలిశారు. ఎమ్మెల్సీ కవిత లేఖ, అనంతర వ్యాఖ్యలు, సంబంధిత పరిణామాలు, రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ రెండో తేదీన నిర్వహించబోయే కార్యక్రమాలపై చర్చించనున్నట్లు సమాచారం.



ఇటీవల కేసీఆర్కు, ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత అంతర్గతంగా లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఆ లేఖ బహిర్గతం కావడం, ఆ తర్వాత ఆమె మీడియాతో మాట్లాడుతూ 'కేసీఆర్ దేవుడు.. కానీ, ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయి' అంటూ వ్యాఖ్యానించడం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్, కేటీఆర్ భేటీ అయినట్లు సమాచారం. జూన్ 1న అమెరికాలోని ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు కేటీఆర్ ఈ నెల 28న వెళ్లనున్నారు. ఈలోగా పార్టీ పరంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకల నిర్వహణపై కార్యాచరణ రూపొందించేందుకు వీలుగా కేసీఆర్తో ఆయన చర్చించే అవకాశముంది.

నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్..
# మోదీ దార్శనిక నాయకత్వానికి నిదర్శనం:పవన్ కల్యాణ్

ప్రపంచంలో భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినట్లు నీతి ఆయోగ్ ప్రకటించడంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు.

**అమరావతి, మే 25, (రిపబ్లిక్ న్యూస్):** ప్రపంచంలో భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినట్లు నీతిఆయోగ్ ప్రకటించడంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు.



ఈ చారిత్రక విజయం ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వానికి, ఎన్డీయే ప్రభుత్వ ప్రగతిశీల పాలనకు నిదర్శనమని కొనియాడారు. "గత దశాబ్ద కాలంగా ఎన్డీయే సుపరిపాలనతో భారత్.. అనేక రంగాల్లో వృద్ధి సాధించింది. ఇది కేవలం ఆర్థిక విజయం మాత్రమే కాదు.. ప్రపంచంలో నవభారత్కు పెరుగుతున్న ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తోంది. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు, వికసిత్ భారత్-2047 వైపు నడిచేందుకు ఇది ఓ ముఖ్యమైన అడుగు" అని పవన్ కల్యాణ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

# కొచ్చి తీరంలో హై అలర్ట్..
## మునిగిన నౌకలో ప్రమాదకర రసాయనాలు..!

కేరళ సముద్ర తీరానికి సమీపంలో ప్రమాదానికి గురైన లైబీరియాకు చెందిన భారీ నౌక పూర్తిగా సముద్రంలో మునిగిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు.

**మే 25, (రిపబ్లిక్ న్యూస్):** లైబీరియాకు చెందిన ఓ భారీ నౌక కేరళ సముద్ర తీరానికి 38 నాటికల్ మైళ్ల దూరంలో శనివారం ప్రమాదానికి గురైంది. తాజాగా అది పూర్తిగా సముద్రంలో మునిగిపోయినట్లు ఇండియన్ కోస్ట్ గార్డ్ ప్రకటించింది. ఈ నౌకలో 640 కంటైనర్లు ఉండగా.. వాటిలో 13 కంటైనర్లలో ప్రమాదకరమైన రసాయనాలు, 12 కంటైనర్లలో కాల్షియం కార్బైడ్, మిగిలిన వాటిలో 84.44 మెట్రిక్ టన్నుల డీజిల్, 367.1 మెట్రిక్ టన్నుల ఫర్నేస్ ఆయిల్ ఉన్నట్లు తెలిపింది.

ఇవి లీకైతే సముద్ర జలాలు తీవ్రంగా కలుషితమయ్యే ప్రమాదం ఉండడంతో అధికారులు కొచ్చి తీరంలో హై అలర్ట్ ప్రకటించారు. కంటైనర్లను, అందులోంచి బయటకు వచ్చిన ఇంధనం తీరంవైపునకు వస్తే తాకొద్దని ప్రజలను కేరళ విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్ర జలాల్లో ఇంధనం లీకై ఎంత మేరకు వ్యాపించిందనే విషయాన్ని తెలుసుకోవడానికి 'ఆయిల్ స్పిల్ మ్యాపింగ్ టెక్నాలజీ' వినియోగించే విమానం సముద్రంపై చక్కర్లు కొడుతోందని అధికారులు తెలిపారు. ఈ ఘటన కారణంగా తలెత్తే పర్యావరణ సమస్యలను ఎదుర్కోవడానికి ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లైబీరియాకు చెందిన ఓ భారీ నౌక శనివరం కేరళ సముద్ర తీరానికి 38 నాటికల్ మైళ్ల దూరంలో తొలుత ఓ వైపునకు ఒరిగిపోయింది. దీంతో అందులోని కొన్ని కంటైనర్లు సముద్రంలో పడిపోయాయి. విఝింజమ్ పోర్టు నుంచి శుక్రవారం బయల్దేరిన 184 మీటర్ల పొడవున్న ఎంఎస్ సీ ఎల్సా-3 నౌక శనివారం మధ్యాహ్నానికి కొచ్చిన్ చేరుకోవాల్సి ఉండగా.. కంటైనర్ నౌక సముద్రంలో మునగడాన్ని గమనించిన ఇండియన్ కోస్ట్ గార్డ్ వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. అందులో ఉన్న మొత్తం 24మంది సిబ్బందిని సురక్షితంగా తీరానికి చేర్చినట్లు అధికారులు పేర్కొన్నారు.



# మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేయించాలి:కేటీఆర్

మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేయించాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు.

**హైదరాబాద్, మే 25, (రిపబ్లిక్ న్యూస్):** మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేయించాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు.



ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. తెలంగాణలో మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి ఉందన్నారు. తాము మహిళలను గౌరవిస్తామని, వారి వృద్ధికి సమాన అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. మహిళలకు అవమానం జరిగితే ఈ రాష్ట్రం అంగీకరించదని పేర్కొన్నారు. ఆడపిల్ల తండ్రిగా ఇలాంటి అనుభవాలు జరగకూడదని కోరుకుంటానని చెప్పారు.

విజయనగరం పేలుళ్ల కుట్ర కేసు..
# మూడో రోజు పోలీసుల విచారణ

విజయనగరం పేలుళ్ల కుట్ర కేసులో మూడో రోజు పోలీసుల విచారణ ప్రారంభమైంది.

**విజయనగరం, మే 25, (రిపబ్లిక్ న్యూస్):** విజయనగరం పేలుళ్ల కుట్ర కేసులో మూడో రోజు పోలీసుల విచారణ ప్రారంభమైంది. విజయనగరం పోలీసు శిక్షణ కళాశాలలో నిందితులు సిరాజ్, సమీర్ను వివిధ కోణాల్లో ప్రశ్నిస్తున్నారు. పోలీసు విచారణకు మరో మూడు రోజుల కస్టడీ గడువు ఉంది. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు అధికారులు వారిని ప్రశ్నిస్తున్నారు.

ఈ కేసులో శనివారం మరో కొత్త కోణం వెలుగు చూసింది. తెలంగాణ భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ వీడియోపై సామాజిక మాధ్యమాల్లో సిరాజ్ కౌంటర్ ఇచ్చినట్లు ఓ అజ్ఞాత వ్యక్తి గుర్తించాడు. సిరాజ్ను ప్రశంసిస్తూ అతడి నుంచి మెసేజ్ వచ్చింది. ఆ తర్వాత సిరాజ్, అజ్ఞాత వ్యక్తి మధ్య కొన్నాళ్లు చాటింగ్ కొనసాగింది. నమ్మకం కుదిరిన తర్వాత సిరాజ్కు అతని వ్యక్తి గత వివరాలు తెలిపాడు. విశాఖకు చెందిన రెవెన్యూ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. ఓ వర్గానికి వ్యతిరేకంగా సిరాజ్ను ప్రోత్సహించాడు. అధికారి పాత్రపై సిరాజ్ నోరు విప్పడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. సిరాజ్, సమీర్ సోషల్ మీడియా ఖాతాలు, విదేశీ ఇంటర్నెట్ కాల్స్పై పోలీసులు ఆరా తీస్తున్నారు.




printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmail.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

# స్పెషల్



# సీఎం కావాలని రాజకీయాల్లోకి రాలేదు: కమల్ హాసన్

'దగ్ లైఫ్' ఈవెంట్లో తన రాజకీయ జీవితం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు అగ్ర నటుడు కమల్ హాసన్. పదవుల కోసం తాను రాజకీయాల్లోకి అడుగుపెట్టలేదని అన్నారు.



అగ్ర నటుడు కమల్ హాసన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'థగ్ లైఫ్'. మణిరత్నం దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం శనివారం చెన్నై వేదికగా జరిగింది. ఇందులో పాల్గొన్న కమల్ హాసన్ సినిమాపై ఎంతో నమ్మకంతో ఉన్నట్లు చెప్పారు. తాము గొప్ప సినిమా రూపొందించామని.. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం తన రాజకీయ జీవితం పై మాట్లాడారు. పదవుల మీద వ్యామోహంతో తాను పాలిటిక్స్లోకి అడుగు పెట్టలేదన్నారు. "ముఖ్యమంత్రి కావాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి అడుగుపెట్టలేదు. తమిళనాడు రాష్ట్ర ప్రజలకు నా వంతు సేవ చేయాలనే ఉద్దేశంతో వచ్చా. ప్రజల కోసం మేము వివిధ కార్యక్రమాలు చేస్తున్నాం. నిదానంగా అనుకున్నది సాధిస్తాం. ఈ ప్రయాణంలో నాతో భాగమైన వారికి ధన్యవాదాలు. వాళ్లు అద్భుతంగా వర్క్ చేస్తున్నారు. అందుకు నేనెంతో గర్వపడుతున్నా. శింబు మీరు కూడా మీ వాళ్ల కోసం నిలబడాలి. వాళ్లను అలరించడం కోసం మరింత శ్రమించాలి. మా సినిమా 'థగ్ లైఫ్' విషయంలో నమ్మకంగా ఉన్నాం. ప్రేక్షకులు తప్పకుండా మా చిత్రాన్ని ఆదరిస్తారు. శాటిలైట్, ఓటీటీ హక్కులు మాత్రమే బయటవాళ్లకు అమ్మాను. డిస్ట్రిబ్యూషన్ మేమే చేస్తున్నాం. మేము ఒక మంచి చిత్రాన్ని రూపొందించాం. ప్రేక్షకులు ఆదరిస్తే.. మా నిర్మాణ సంస్థలో ఇలాంటి ఎన్నో గొప్ప చిత్రాలను రూపొందిస్తాం. ఈ సినిమాలో మలయాళ నటుడు జోజూ జార్జ్ కీలక పాత్ర పోషించారు. నటీనటులు ఏదైనా కొత్తగా ప్రయత్నిస్తే.. వారిని నేను పోటీగా తీసుకుంటా. కానీ, జోజూ విషయంలో మాత్రం అసూయ ఫీలవుతుంటా. ఆయన అద్భుతంగా వర్క్ చేస్తుంటారు. ఏది ఏమైనా నటీనటులను స్వాగతించాల్సిన బాధ్యత నాపై ఉంది" అని కమల్ హాసన్ అన్నారు. ఆయన మాటలతో జోజూ ఎమోషనల్ అయ్యారు.

## మూడు రోజులు స్నానం చేయలేదు:శివ రాజ్‌కుమార్



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్. కమల్ తనకు ఉన్న అనుబంధం గురించి మాట్లాడారు. "నా చిన్నతనంలో నాన్నను కలవడానికి తొలిసారి కమల్ హాసన్ మా ఇంటికి వచ్చారు. అక్కడే ఉన్న నా గురించి ఆయన ఆరా తీయగా.. నాన్న పరిచయం చేశారు. ఆ క్షణం ఆయన్ని ప్రేమగా హత్తుకున్నా. ఆ అనుభూతి చెదిరిపోకూడదని భావించా. మూడు రోజులపాటు స్నానం చేయలేదు. ఆయన అంటే నాకంత ఇష్టం. ఆయన నటించిన అన్ని సినిమాలు చూస్తుంటా. ఇటీవల నాకు క్యాన్సర్ ట్రీట్మెంట్ జరిగిన విషయం తెలిసిందే. ఆస్పత్రిలో ఉన్నప్పుడు కమల్ నుంచి ఫోన్ వచ్చింది. ఆయన మాట్లాడుతుంటే ధైర్యంగా అనిపించింది. 'శివన్నా.. నీకు తెలుసా.. నీతో మాట్లాడుతుంటే నాకెందుకో కన్నీళ్లు వస్తున్నాయి' అన్నారు. ఆ క్షణం మా నాన్నతో మాట్లాడుతున్నట్లు అనిపించింది" అని శివన్న వివరించారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## మా పాపను నాన్న ఎత్తుకోవడం చూడాలని ఉంది: మనోజ్ ఎమోషనల్



తన కుటుంబం మొత్తం కలిసి కూర్చొని భోజనం చేయాలని, కౌగిలించుకుని ప్రేమగా మాట్లాడుకునే రోజు రావాలని భగవంతుడిని ప్రార్థిస్తానని నటుడు మంచు మనోజ్ తెలిపారు. 'భైరవం' ప్రమోషన్స్లో భాగంగా తాజాగా ఇచ్చిన పాడ్కాస్ట్లో ఆయన తన మనసులోని మాట బయటపెట్టారు. "నా కుమార్తెను నాన్న ఎత్తుకుంటే చూడాలనుకుంటున్నా" అంటూ భావోద్వేగానికి గురయ్యారు. తండ్రి అంటే తనకెంతో ఇష్టమన్నారు. ఆయనపై ఎలాంటి కోపం లేదని చెప్పారు. "తాజా పరిణామాల రీత్యా అమ్మను ఎంతో మిస్ అవుతున్నా. అమ్మను కలవాలంటే పలు కండిషన్స్ పెట్టారు. ఆమెను కలవాలంటే పర్మిషన్ తీసుకోవాలి. లేదంటే నేను వెళ్తే ఆమె ఇంటి బయటకు వచ్చి కలవాలి. ఇలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదు. ఆమె కూడా మమ్మల్ని ఎంతో మిస్ అవుతుంది. అప్పుడప్పుడూ మా వద్దకు వస్తుంటుంది. మా పాప అంటే అమ్మకు ఎంతో ఇష్టం. గొడవల కారణంగా అక్కను దూరం పెట్టాను. ఇటీవల తన ఆధ్వర్యంలో జరిగిన టీచ్ ఫర్ ఛేంజ్ ఈవెంట్కు నేను వస్తానో రానో కూడా ఆమెకు తెలియదు. కానీ, ఆమె కోసమే వెళ్లాను. ఇంతకాలం నేను ఏమైపోతానోనని తను ఎంతో భయపడింది. దేవుడి దయ, నా పిల్లలు, అభిమానులు ఇచ్చిన ధైర్యం వల్ల నిలబడ్డా" అని ఆయన చెప్పారు. "నీపై ఆధారపడి ఒక కుటుంబం ఉంది. ఎదుటివాళ్లు కత్తులతో దాడి చేయడానికి వస్తున్నారు. నీ ముందు ఒక కత్తి పడి ఉంది. అలాంటప్పుడు ఏం చేస్తావు. వాళ్లు వచ్చి దాడి చేయని ఫర్వాలేదు అని చూస్తుంటావా? లేదా నీ వాళ్ల కోసం నువ్వు కత్తి ఎత్తుతావా? ఒంటరిగా ఉన్నప్పుడు ఎన్ని అయినా పడగలవు. నా జీవితంలోనూ అదే జరిగింది. నాకంటూ మౌనిక, పిల్లలు ఉన్నారు. ఆమె జీవితంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంది. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయింది. అలాంటి బాధ ఎవరికీ రాకూడదు. ఆమెకు ఈ గొడవలతో ఏమాత్రం సంబంధం లేదు. మేము ఇప్పటివరకూ ఆస్తి అడగలేదు. మేము అడిగినట్లు నిరూపించమని అడుగుతున్నా. గొడవైన వెంటనే నాపై ఫిర్యాదు చేసి సీసీ టీవీ కెమెరాలను మాయం చేశారు. ఇది ఎప్పుడూ జరిగేదే. ఈసారి అందరికీ తెలియాలనే బయటకు వచ్చి చెప్పా. నిందలు వేసి.. వాటిని నిజమని అంగీకరించమంటే నా వల్ల కాదు. నాక్కూడా ఇద్దరు పిల్లలు ఉన్నారు. తప్పు చేస్తే దాక్కుంటా. కూర్చొని మాట్లాడదాం.. గొడవలొద్దు అంటున్నా. వాళ్లు చేసే పనులకు కోపం రావడం లేదు. బాధగా ఉంటుంది. ఇంత జరిగినా వాళ్లను ప్రేమించడం తప్ప ద్వేషించ లేదు" అని మనోజ్ వివరించారు. మంచు మనోజ్, నారా రోహిత్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో నటించిన 'భైరవం' చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది.


ప్రజా రిపబ్లిక్ దిన పత్రిక

9948814188, 9985876888

ప్రకటన

ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501

డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001


బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్


## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1865 : నోబెల్ బహుమతి గ్రహీత, డచ్చి భౌతిక శాస్త్రవేత్త పీటర్ జీమన్ జననం (మ. 1943).
- 1886 : భారత స్వాతంత్ర సమరయోధుడు రాస్ బిహారి బోస్ జననం (మ. 1945). (చిత్రంలో)
- 1897 : భారత స్వాతంత్ర సమరయోధుడు, పండితుడు, కవి కల్లూరు సుబ్బారావు జననం (మ.1973).
- 1899 : బెంగాలీ కవి, సంగీతకారుడు, విప్లవకారుడు, ఉద్యమకారుడు ఖాజీ నజ్రుల్ ఇస్లాం జననం (మ.1976 ).
- 1924 : బెంగాల్‌కు చెందిన శాస్త్రవేత్త, సాహితీ వేత్త, సంఘసంస్కర్త, తత్త్వవేత్త అశుతోష్ ముఖర్జీ మరణం (జ.1864).
- 1936 : భారత క్రికెటర్ రుసీ సూర్తి జననం (మ. 2013).
- 1972 : భారతదేశ సినిమా దర్శకుడు, నిర్మాత, రచయిత, నటుడు కరణ్ జోహార్ జననం.
- 1973 : తెలుగు నాటకరంగంలో సుప్రసిద్ధుడు కె.వెంకటేశ్వరరావు మరణం (జ. 1923).
- 2001 : 32 సంవత్సరాల ఎరిక్ వీహెన్‌మేయర్ ప్రపంచ అత్యున్నత ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కిన మొదటి అంధుడుగా చరిత్రకెక్కాడు.
- 2014 : 14 సంవత్సరాల అతి పిన్న వయస్సులోనే ఎవరెస్ట్ అధిరోహించిన బాలికగా రికార్డు సృష్టించిన తెలంగాణ బాలిక మాలవత్ పూర్ణ
- 2021 : నేషనల్ సింగ్ అవుట్ డే.



పీటర్ జీమన్


రాస్ బిహారి బోస్


కల్లూరు సుబ్బారావు


ఖాజీ నజ్రుల్ ఇస్లాం


అశుతోష్ ముఖర్జీ


రుసీ సూర్తి


కరణ్ జోహార్


కె.వెంకటేశ్వరరావు


ఎరిక్ వీహెన్‌మేయర్


మాలవత్ పూర్ణ



నేషనల్ సింగ్ అవుట్ డే

రిపబ్లిక్ స్పోర్ట్స్

## అయోధ్యలో హనుమంతుణ్ని దర్శించుకున్న విరాట్ కోహ్లి, అనుష్క శర్మ

విరాట్ కోహ్లి, అనుష్క శర్మ దంపతులు అయోధ్యలోని ప్రముఖ హనుమాన్ గరి దేవాలయాన్ని సందర్శించారు.




టీమ్ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి అనుష్క శర్మ అయోధ్యలోని ప్రముఖ హనుమాన్ గర్హి దేవాలయాన్ని ఆదివారం సందర్శించారు. హనుమంతుణ్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ పూజారులు పూలమాలలతో కోహ్లి, అనుష్క శర్మ దంపతులను సత్కరించారు. నుదుటన తిలకం దిద్దారు. తర్వాత స్వామివారి చిత్రపటాలను అందించారు. ఇటీవలే కోహ్లి, అనుష్క శర్మ ఉత్తరప్రదేశ్లోని బృందావన్ ఆశ్రమాన్ని సందర్శించారు. ఆధ్యాత్మిక గురువైన ప్రేమానంద్ గోవింద్ శరణ్ జీ మహరాజ్ ఆశీర్వాదాలు తీసుకున్నారు. టెస్ట్ క్రికెట్కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత విరాట్ కోహ్లి ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఇస్తున్నాడు. అనుష్కశర్మతో కలిసి పలు క్షేత్రాలు సందర్శిస్తున్నాడు.

## ఆరోగ్యం


## ఎండాకాలంలో వేడిని తగ్గించి షుగర్, బీపిలను కంట్రోల్ చేసే పెసలు, ఎలా తినాలంటే

పెసరపప్పు, పెసలు ఎంత రుచిగా ఉంటాయో. వీటిని తినడం వల్ల అంతే లాభాలనిస్తాయి. అందుకే, వీటిని రెగ్యులర్‌గా డైట్‌లో చేర్చుకోవడం చాలా మంచిది.

ఎండాకాలం వచ్చిందంటే చాలు పెసరపప్పు, పెసరపప్పు చారు, పెసరెట్టు ఇలా చాలా రకాలుగా పెసలని వాడతారు. దీనికి కారణం వీటిలోని గుణాల కారణంగా వీటిని తినడం వల్ల శరీరానికి చలువ చేస్తుంది. వీటిని మనం తినడం వల్ల ఎండాకాలంలో వచ్చే వేడిని తగ్గించుకోవచ్చు. దీనికోసం పెసలని ఎలా అయినా తినొచ్చు. అయితే, ముఖ్యంగా వీటిని ఉడికించి తింటే మరికొన్ని అద్భుత లాభాలున్నాయి. పెసలని ప్లాంట్ బేస్డ్ ప్రోటీని చెప్పొచ్చు. ఇందులో ఎన్నో అమైనో యాసిడ్స్ ఉంటాయి. వీటిలోని ప్రోటీన్స్, విటమిన్స్ ఎ, సిలు, బాడీలో ఇమ్యూనిటీని పెంచుతాయి. అంతేకాకుండా ఇందులో ఐరన్, వీటితో పాటు జింక్ కూడా ఉంటుంది. ఇన్ని లాభాలున్న ఈ పెసలని ఉడికించి ఉదయాన్నే తింటే చాలా లాభాలు ఉంటాయి.




### హైబీపి తగ్గేందుకు



హైపీబి ఉన్నవారికి పెసలు చాలా మంచివి. రెగ్యులర్‌గా పెసలని ఏదో రకంగా తీసుకుంటే బ్లడ్ ప్రెజర్ కంట్రోల్‌లో ఉంటుంది. ఇందులోని విటమిన్స్ హార్మోన్స్‌ని ప్రేరేపిస్తాయి. దీంతో ఎదిగే పిల్లలకి ఇది మంచి ఆహారమని చెప్పొచ్చు. ఆరోగ్యానికే కాదండి అందానికి కూడా చాలా బాగా పనిచేస్తాయి. పెసల్ని రెగ్యులర్‌గా తింటే యవ్వనంగా కనిపిస్తారు. ఇందులోని కాపర్ చర్మంపై ముడతల్ని తగ్గిస్తుంది. యాంటీఆక్సిడెంట్ గుణాలు ఫ్రీ రాడికల్స్‌ని నుంచి స్కిన్ డ్యామేజ్ కాకుండా హెల్ప్ చేస్తాయి. అదే విధంగా, కొల్లాజెన్ ప్రొడక్షన్‌ని తగ్గిస్తాయి.

### రక్తప్రసరణ



పెసలలో ఎక్కువగా ఐరన్ ఉంటుంది. వీటిని తినడం వల్ల రక్తం పెరిగి రక్త సరఫరా సరిగా ఉంటుంది. అంతేకాకుండా ఇందులోని ఐరన్ శరీరంలోని అవయవాలకి ఆక్సీజన్‌ని సమృద్ధిగా అందిస్తుంది. కాబట్టి, రెగ్యులర్‌గా పెసలని డైట్‌లో యాడ్ చేసుకోవడం మంచిది.

### షుగర్ కంట్రోల్ అయ్యేందుకు



పెసలలో తక్కువగా గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల బాడీ ఇన్సులిన్‌ని తగ్గిస్తుంది. అదే విధంగా బ్లడ్ గ్లూకోజ్, ఫ్యాట్ లెవల్స్‌ని కూడా తగ్గిస్తుంది. ఈ కారణం వల్లే బరువు కూడా ఈజీగా తగ్గుతారు. షుగర్ వంటి సమస్యలతో బాధపడేవారు రెగ్యులర్‌గా పెసలని వారి డైట్‌లో యాడ్ చేసుకోండి.

### జీర్ణ వ్యవస్థకి




పెసలలో ఎక్కువగా ఫైబర్ ఉంటుంది. వీటిని తినడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. జీర్ణ వ్యవస్థ హెల్దీగా మారుతుంది. మలబద్ధకంగా, అజీర్ణం, బ్లోటింగ్ వంటిసమస్యలన్నీ తగ్గుతాయి. దీనికోసం రెగ్యులర్‌గా పెసలని తీసుకోవాలి. అంతేకాకుండా, పెసలని తినడం వల్ల బ్రెయిన్ హెల్దీగా మారుతుంది. న్యూరల్ హెల్త్ మెరుగ్గా మారుతుంది.

### మజిల్స్ పెరిగేందుకు



జిమ్ చేసేవారు మజిల్స్ పెరగాలని చాలా కసరత్తులు చేస్తారు. రకరకాల ఫుడ్స్ తీసుకుంటారు. ఎన్నెన్నో ఎక్సర్‌సైజెస్ చేస్తారు. ప్రోటీన్ షేక్స్ వంటివి తీసుకుంటారు. వాటి బదులు పెసలని హ్యాపీగా తీసుకోవచ్చు. దీని వల్ల కూడా మజిల్స్ పెరుగుతాయి. జిమ్ చేసేవారు మాత్రమే కాదు, మజిల్స్, మజిల్ పవర్ పెంచుకోవాలనుకునేవారు ఈ పెసలని రెగ్యులర్‌గా వారి డైట్‌లో చేర్చుకుంటే మంచి రిజల్ట్స్ ఉంటాయి. దీంతో పాటు ఇందులో కాల్షియం ఉంటుంది. దీంతో ఎముకలు కూడా బలంగా మారతాయి.

### ఎలా తినాలంటే



ఉదయాన్నే హెల్దీ బ్రేక్‌ఫాస్ట్ తినడం చాలా మంచిది. వీటిని తినడం వల్ల మనకి ఎన్నో పోషకాలు అందుతాయి. పెసలని మనం మొలకల్లా చేసి తినొచ్చు. లేదా మనం ఉడికించి తినొచ్చు. దీని వల్ల మంచి ప్రోటీన్, ఫైబర్ బాడీకి అందుతుంది. రోజంతా యాక్టివ్‌గా తింటారు. పైగా, ప్రోటీన్, ఫైబర్ బాడీకి అందాల్సిన పోషకాలు. దీని వల్ల చాలానే లాభాలు ఉంటాయి. అయితే, మనం పచ్చి మొలకల బదులు వీటిని ఉడికించి తింటే ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలు అయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది. వీటిని చక్కగా మనం రోజూ డైట్‌లో యాడ్ చేసుకోవచ్చు. పెసరపప్పు చారు, పెసరపప్పు పులగం, పెసరపప్పు హల్వా, పెసరపప్పు పొంగల్.. అబ్బో ఇలా చాలా రకాలుగా చేయొచ్చు.

గమనిక:ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.